ప్రజాశక్తి
మంగళవారం 3 సెప్టెంబర్ 2024 5 అనంతపురం





అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మినీ గోకులం.. స్పందన నామమాత్రం ..!

◆కొన్ని చోట్ల ఎక్కువ.. మరికొన్ని చోట్ల తక్కువ డిమాండ్..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాల నిర్మాణానికి ప్రోత్సహకాలు అందిస్తోంది. వీటి నిర్మాణానికి అనేక చోట్ల పెద్దఎత్తున డిమాండ్ ఉండగా, మరికొన్ని చోట్ల మాత్రం మంజూరైన వరకు కూడా దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉండటం గమనార్హం. అది కూడా ఆర్థిక శాఖ మంత్రి సొంత నియోజకవర్గమైన ఉరవకొండలో వీటి కోసం దరఖాస్తులు తక్కువగా ఉన్నాయి. అదే విధంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ డిమాండ్ తక్కువగా ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 90, 70 శాతం సబ్సిడీతో గోకులాల నిర్మాణానికి మంజూరు చేసింది. పాడి పశువుల షెడ్డు 90 శాతం సబ్సిడీతో ఇచ్చారు. మూడు కేటగిరీల్లో సబ్సిడీని ఇవ్వనున్నారు. రెండు పశువులున్న వాటికి రూ.1.15 లక్షలు యూనిట్ విలువ. రూ.1.03 లక్షలు సబ్సిడీ ఇవ్వనున్నారు. రూ.11,500 లబ్దిదారుడు చెల్లించాలి. నాలుగు పశువులున్న వాటికి రూ.1.85 లక్షలు, రూ18,500 లబ్దిదారుడు చెల్లించాలి. ఆరు పశువులున్న వాటికి రూ.2.30 లక్షలు యూనిట్ విలువ ఇందులో రూ.2.07 లక్షలు సబ్సిడీ ఇస్తారు. గొర్రెలకు అవుతే 70 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. దీని ప్రకారం 20 జీవాలకు రూ.1.30 యూనిట్ విలువ. రూ.91 వేలు సబ్సిడీ విలువ. 50 జీవాలకు రూ.2.30 లక్షలు యూనిట్ విలువ రూ.1.61 సబ్సిడీ, రూ.69 వేలు లబ్దిదారుడు చెల్లించాలి. అదే 100 కోళ్ల షెడ్డు రూ.87 వేలు యూనిట్ విలువ రూ.60900 సబ్సిడీ లబ్ధిదారి వాట రూ.26100 చెల్లించాల్సి ఉంటుంది. 200 కోళ్లు ఉన్న యూనిట్ అయితే రూ.1.32 లక్షలు విలువ కాగా రూ.92400 సబ్సిడీ కాగా రూ.9600 లబ్దిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంది.

ఆ రెండు చోట్ల దరఖాస్తులు తక్కువ

అనంతపురం జిల్లా మొత్తంగా 1475 యూనిట్లు మంజూరవగా 1832 మంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గాల వారీగా చూసినప్పుడు ఉరవకొండ నియోజకవర్గంలో బెళుగుప్ప మండలానికి 48 యూనిట్లు మంజూరవగా ఐదు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కూడేరు మండలంలో 48కిగానూ ఆరు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. విడపనకల్లుకు 11 దరఖాస్తులు, ఉరవకొండకు 31 దరఖాస్తులొచ్చాయి. వజ్రకరువూరులో మాత్రం



48కిగానూ 67 వచ్చాయి. నియోజకవర్గంలో 238 యూనిట్లకుగా దరఖాస్తు చేసుకున్నవి 120 వచ్చాయి. శెట్టూరులో 47 యూనిట్లకుగానూ 25 దరఖాస్తులొచ్చాయి. కుందుర్పిలో 48కిగానూ 29 దరఖాస్తులొచ్చాయి. కంబదూరు 47కిగానూ 15 దరఖాస్తులొచ్చాయి. గుంతకల్లులో 47కిగానూ 21 దరఖాస్తులొచ్చాయి. తక్కిన మండలాల్లో మంజూరైన యూనిట్లకు దరఖాస్తులొచ్చాయి.

క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అన్ని శాఖల అధికారులు విధిగా ఎప్పటికప్పుడు వారి పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలనలు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఎస్‌డిసి శిరీష, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 384 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఇందులో వచ్చిన సమస్యలను పద్ధతిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఏ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఆ స్థాయిలోనే పరిష్కరించాలని తెలియజేశారు. జిల్లా కేంద్రం వరకు అర్జీదారులు రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే పరిష్కారాలు చూపాలన్నారు. జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ విధి విధానాలు అమలయ్యేలా అధికారులు చూడాలని తెలిపారు. అనంతరం పింఛన్ల పంపిణీలో మొదటగా వందశాతం పూర్తి చేసిన మొదటి స్థానం తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, రెండవ స్థానం గుత్తి మండల స్పెషల్ ఆఫీసర్ కళ్యాణి, మూడో స్థానంలో పుట్లూరు స్పెషల్ ఆఫీసర్ యోగానంద రెడ్డిలను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం, ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలకు ఐఎస్ఒ సర్టిఫికెట్లు రాగ కలెక్టర్ చేతుల మీదుగా ఐఎస్ఒ సర్టిఫికెట్లను ఆయా శాఖల అధికారులకు అందజేశారు. మహిళా అభివద్ధి, శిశు సంక్షేమ శాఖ అనంతపురం ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు బ్యానర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిపిఒ ప్రభాకర్ రావు, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తాం

తాగునీటి సరఫరా కార్మికులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు తెలిపారు. ఆ సంఘం జిల్లా ట్రెజరర్, మండల అధ్యక్షులు వన్నూరుస్వామి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని చాలా రోజులుగా కోరు తున్నా ఫలితం లేదని, దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి కార్మికులు సమ్మె బాట పడుతున్నట్లు తెలిపారు. అనంతరం 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ దాసానాయక్, జడ్పిటిసి ప్రభావతమ్మ, స్థానిక సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. సిఐటియు అనుబంధ సంఘాలు సమ్మెలో పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి మండల కార్యదర్శి చిత్తప్ప, నాయకులు రమేష్, తిప్పేస్వామి, హనుమంతరెడ్డి, లింగమయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నార్పల : పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బి.పప్పూరు పంప్‌హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు చేపట్టిన నిరసన సోమవారం 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తాము ఏం తిని బతకాలని ప్రశ్నించారు. 12 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లానాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ఈశ్వరయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల పరిధిలో పని చేస్తున్న శ్రీసత్యసాయి కార్మికుల సమ్మె సోమవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా తహశీల్దార్ లక్ష్మీనాయరాయణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివశంకర్, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ దస్తగిరికి వినతిపత్రాలు సమర్పించారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు శ్రీరాములు, చిన్న, శ్రీరాములు, ఇమాములు, శ్రీధర్, దివాకర్, హరి, చెన్నకేశవులు, రమేశరెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : వేతనాలు చెల్లించాలని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కల్లూరు గ్రామంలోని నీలం సంజీవరెడ్డి సర్కిల్‌లో దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాషా, సాంబశివ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



నార్పలలో మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న నీటిసరఫరా కార్మికులు



పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తి చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రైతులు ఈ నెల 10వ తేదీ లోపు ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తి చేయాలని ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని బిఎన్.హళ్లి, బొమ్మక్కపల్లి, 74-ఉడేగోళం, వడ్రహొన్నూరు గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ, కంది, ఉల్లి, మిరప, తదితర పంటలను సోమవారం సీనియర్ శాస్త్రవేత్త చెన్నరాయుడు వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. వివిధ రకాల పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. అధిక వర్షాల వల్ల పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటికే పంపాలన్నారు. పంట పొలాల చుట్టూ మూడు వరుసలు సజ్జ, జొన్న పంటలు వేసుకోవాలని సూచించారు. వారి వెంట ఎఒ మహేంద్ర, వ్యవసాయ విస్తరణ అధికారి ఆంజనేయులు, కార్తీక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఘనంగా దొణగంగమ్మ జాతర

రాయదుర్గం రూరల్ : మండలంలోని టి.వీరాపురం గ్రామంలో సోమవారం దొణ గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో ఆఖరి రోజున దొణ గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొణ వద్ద భక్తులు గంగపూజ నిర్వహించారు. రాయదుర్గం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచి సుంకన్న, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, సోమశేఖర్, హనుమంతు ఉన్నారు.

వరదలతో ప్రజాజీవనం అస్తవ్యస్తం

రాయదుర్గం : ఇటీవల దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న ప్రకృతి వైపరీత్యాలు, వరదలతో జనజీవనం అస్తవ్యస్తం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉదారంగా సాయం అందిస్తుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

అనుమతి లేని మందులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రైతులకు అనుమతి లేని మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎఒ సరిత హెచ్చరించారు. ఆమె సోమవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. బిల్లు బుక్కులు తప్పనిసరిగా యజమాని వద్ద ఉండాలని ఆదేశించారు. అనుమతి లేని పురుగు మందులు, ఎరువులు విక్రయించరాదని, ధరల పట్టిక ప్రదర్శించాలని, ఎమ్మార్పీకే విక్రయించాలని తెలిపారు. కాలం చెల్లిన మందులు విక్రయించినా, నిబంధనలను అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. నిబంధనలు పాటిం చని ఎరువుల దుకాణాలపై ఎవరైనా వ్యవసాయ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఆమె స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో 10,222 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు (50 శాతం) పూర్తయిందన్నారు. ఈ క్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని రైతు సేవా సిబ్బందికి సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ ఈ నెల 15వ తేదీ లోపు చేయించుకోవాలన్నారు.




ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎఒ సరిత

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ పెరిగిన నగరానికి అనుగుణంగా 200 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు, రెండు సంవత్సరాలుగా చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, డెత్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, యూనిఫాం, కొబ్బరినూనె, చెప్పులు, స్టిచ్చింగ్ ఛార్జెస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రెగ్యులర్ కార్మికులకు జిపిఎఫ్ అకౌంట్ తెరవాలని, రిటైర్మెంట్ అయినవారి స్థానంలో విధులు నిర్వహిస్తున్న వారికి వేతనం చెల్లించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రెగ్యులర్ అధ్యక్ష, కార్యదర్శులు ముతురాజు, నల్లప్ప, నారాయణస్వామి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేశు, ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు ఓబుళపతి, పోతులయ్య, రాయుడు, మురళి, బత్తల ఆదినారాయణ, లక్ష్మీనరసమ్మ, శ్రీనివాసమూర్తి, ఆనంద్, బంగ్లా రాఘవ, ఎం.ఆది, కమల్, కుళ్లాయప్ప, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజినేయులు మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. 62 సంవత్సరాల పేరుతో తొలగిస్తున్న కార్మికుడు తిమ్మయ్య స్థానంలో అతని కుమారున్ని నియమించాలని కోరారు. మున్సిపాలిటీ విస్తీర్ణ ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.సుంకన్న, కె.రామంజి, కె.బాలరంగడు, తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులకు సమస్యలను విన్నవిస్తున్న మున్సిపల్ కార్మికులు

రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు



తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల నిరసన

ప్రజాశక్తి-శింగనమల

అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో వెంటనే రూ.20వేలు జమ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురవక భూములను బీళ్లు పెట్టిన రైతులకు వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలైన అలసందలు, ఉలవలు, కొర్రలు, జొన్నలు, పెసులు, మొదలగు విత్తనాలను అందజేయాలన్నారు. అలాగే 2023-24 బీమా ప్రకటించాలని, వ్యవసాయ పంపుసెట్ల మోటార్లకు మీటర్లు బిగించరాదని, జీవో 22ని రద్దు చేయాలని, హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకూ నీరు ఇవ్వాలని, చెరువులకు హెచ్చెల్సీ నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల కార్యదర్శి కొండారెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్, ఓబిరెడ్డి, సహాయ కార్యదర్శి రమేష్, వెంకటస్వామి, బాలరాజు, సీనా, బాషా, రామాంజనేయులు, జయరాముడు, నిదనవాడ జగన్నాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'కళ్లు కనిపించవు.. పింఛను ఇప్పించండి సారూ'



రామలక్ష్మి

కుందుర్పి : రెండు కళ్లు కనిపించవు పింఛను ఇప్పించండి సారూ అని మండల కేంద్రమైన కుందుర్పికి చెందిన దళిత మహిళ రామలక్ష్మమ్మ వేడుకుంటుంది. ఆమె తెలిపిన వివరాలు.. ఆరు నెలల క్రితం కొడుకు అనారోగ్యంతో మృతి చెందాడు. భర్తకు కూడా ఆరోగ్యం సరిగా లేదు. దీంతో రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొంది. మా కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని పింఛను ఇప్పించండి సారూ అని ఆమె కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు మొరపెట్టుకుంది.

మారెమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన

రాయదుర్గం : పట్టణ దేవత మారెమ్మ జాతర సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప పరిశీలించారు. జాతర సందర్భంగా మంగళవారం దుగ్గిలమ్మ ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పారిశుధ్యం చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌ను ఆదేశించారు. ఆమె వెంట వార్డు ఇన్‌ఛార్జి బషీర్, పొరాలు శివ, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు ఉన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోండి : డీఎస్పీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజలు శాంతియుతంగా వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు కోరారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం డీఎస్పీ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమితి సభ్యులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పురపాలక సంఘం, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు పరిశీలించి మండ పం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించి అనుమతి ఇస్తారన్నారు. అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితిలో వినాయక మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. పర్యావరణ పరిరక్షణ మేరకు మట్టి వినాయకుడిని ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉంచడం, రాజకీయ ఉపన్యాసాలు చేయడం తగద న్నారు. నిమజ్జనం ఊరేగింపులో డిజె ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ సమితి ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. సమావేశంలో సిఐ జయనాయక్, పట్టణంలోని వివిధ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తూరు జూనియర్ కళాశాలలో జనసేన రాష్ట్ర కార్య నిర్వహణ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి, అంకె ఈశ్వరయ్యలతో కలిసి మొక్కలను నాటారు. పాతూరు చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద డొక్కా సీతమ్మ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌వి థియేటర్‌లో పవన్ కళ్యాణ్ అభిమానుల నడుమ భారీ కేక్ కట్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్క జన సైనికుడు ముందడుగు వేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవ రాయుడు, సిద్ధూ, జిల్లా సహాయ కార్యదర్శులు జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు సదానందం, గ్రంధి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు



పవన్ కళ్యాణ్ అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

పవన్ కళ్యాణ్ అభిమానుల రక్తదాన శిబిరం

రాయదుర్గం : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా గుమ్మగట్ట మండల వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సమితి ప్రతినిధులు, టిడిపి నాయకులు హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దాసానాయక్‌కు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని అందజేశారు. ముందుగా నియోజకవర్గ జనసేన మీడియా ఇన్‌ఛార్జి రాయుడు ఆధ్వర్యంలో జనసేన జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రభావతమ్మ, నాగరాజు, ఆంజనేయులు, విశ్వనాథ్, కరేగౌడ, తిమ్మరాజు, వకీల్ రాజన్న, ఎరడికెర క్యాతన్న, రజాక్‌వలి, వినాయక్, శివానంద, వన్నూరుస్వామి, శివ, రాజేష్, మహేష్, మణికంఠ, ఓబులేష్, హనుమంతు, వెంకటేశులు, రమేష్, జయకృష్ణ, సురేష్, ఉచ్చప్ప పాల్గొన్నారు. అలాగే సంతేకొండాపురం గ్రామంలో సర్పంచి వనిత మల్లికార్జున, మాజీ మండల అధ్యక్షులు వన్నూరుస్వామి కేక్ కట్ చేసి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, ఎర్రిస్వామి, వెంకటేశులు, నరసింహులు, క్రిష్టప్ప, మల్లికార్జున, హరీష్, రాయుడు, గోవిందు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో 'వైఎస్ఆర్' పదిలం

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో పదిలంగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ మరణించి 14 ఏళ్లు గడిచినా ఆయనపై ప్రజలకు ఉన్న ప్రేమ తగ్గలేదన్నారు. ముఖ్యంగా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ఇకపోతే అనంతపురం జిల్లా కరువు కాటకాలతో అల్లాడుతున్న సమయంలో జీడిపల్లి రిజర్వాయర్ నిర్మించి కృష్ణాజలాలను తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సానేపల్లి మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్లు కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, వాసంతిసాహిత్య, నాయకులు మీసాల రంగన్న, బోయ వీరాంజనేయులు, పాశం నాగ రంగస్వామి యాదవ్, కెవి.రమణ, మాల్యవంతం పెన్నోబులేసు, వెన్నపూస రవీంద్రారెడ్డి, గౌస్ బేగ్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, బీసీ రమేష్ గౌడ్, రిలాక్స్ నాగరాజు, బోయ రాజారామ్, సైపుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, గాజుల ఉమాపతి, కఖజ్ ఘర్ రిజ్వాన్, చింతా సోమశేఖర్, చింతకుంట మధుసూదన్, మహిళా నేతలు కృష్ణవేణి, భారతి, మహబూబ్‌బీ, రాధాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఎదుట ఉన్న విగ్రహానికి మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి.లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, నసనకోట ముత్యాలురెడ్డి వారి యోగానందరెడ్డి, వాసు, హేమంత్‌కుమార్, చిగండి రమేష్, ఆది, వీరాయాదవ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పంచాయితీ కార్యాలయం వద్ద తోపుదుర్తి నయనతారెడ్డి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు హేమలత, అంజనప్ప, వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, నాగరాజు, వన్నూరప్ప, జి.కొండారెడ్డి, బాలపోతన్న, టి.శివారెడ్డి, శ్రీరాములు, ఓబి, టైలర్ దామోదర్‌రెడ్డి, మురళి, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రంలోని వైఎస్ విగ్రహానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, నాయకులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని బస్సుషెల్టర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భర్త త్రిలోకనాథ్‌రెడ్డి, నాయకులు దుద్దేకుంట రామాంజనేయులు, చిన్న మచ్చన్న, పాటిల్ శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, నాగిరెడ్డి, అనిల్, సర్పంచు రమేష్, నక్కలపల్లి రామిరెడ్డి, రుద్రానంద, గంగవరం ప్రసాద్ స్వామి, ఈశ్వర్, ధనుంజయ, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, ఎం.వీరాంజనేయులు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి,



శింగనమలలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు



అనంతపురంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

బండిమీదపల్లి నరసింహారెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులునాయక్, మల్లికార్జునరెడ్డి, బద్యానాయక్, ఎన్‌వి.నారాయణ, శివమ్మ, నాగులగుడ్డం మాజీజడ్‌పిటిసి ఆదినారాయణ, బండి శీనా, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాలు శిల్ప, జడ్‌పిటిసి మల్లికార్జున, కౌన్సిలర్లు గోవిందరాజులు, దేవరాజ్, శ్రీలక్ష్మి, శారద, షబ్బీర్, శ్రీనివాసరెడ్డి, లావణ్య, మంజునాథ్, సంజీవ, కో ఆప్షన్ సభ్యులు నజీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుందుర్పి : వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జడ్‌పిటిసి రాధాస్వామి, ఎంపిపి కమల నాగరాజు, సర్పంచి మారుతీశ్వరరామమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ వన్నూరుస్వామి, ఎంపిటిసి గంగమ్మ హనుమంతరాయుడు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, అప్పిలేపల్లి సర్పంచి హసీనాబీ అతావుల్లా, గౌరీ గార్మెంట్స్ గోపాల్, నాయకులు మంజునాథ్, వైబి.హనుమంతరాయుడు, ఎస్ఎంసి ఛైర్మన్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను వైసిపి నాయకులు సోమవారం నాడు మండల వ్యాప్తంగా నిర్వహించారు. మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్పిటిసి భోగతి విజయ ప్రతాప్ రెడ్డి పూల మాలలు వేసినివాళులుఅర్పించారు. వైఎస్.రాజశేఖర్ చేపట్టిన జలయజ్ఞం వల్లనే నేడు జిల్లా చెరువులకు నీరు చేరుతున్నాయని ఆయన తెలిపారు.

మచ్చా దత్తారెడ్డి సెంచరీ

553 పరుగులకు ఆలౌటైన అనంతపురం జట్టు



మచ్చా దత్తారెడ్డి

అనంతపురం : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని డాక్టర్ వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న అండర్-23 ఆంధ్రాసౌత్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం జిల్లా జట్టు కెప్టెన్, రంజీ క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి సూపర్ సెంచరీతో ఆకట్టుకున్నారు. అనంతపురం-కడప జట్ల మధ్య జరుగుతున్న పోటీలో అనంతపురం జట్టు మొదట బ్యాటింగ్ చేసి 553 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంత జట్టుల్లో మచ్చా దత్తారెడ్డి 11 సిక్సర్లు, 13 ఫోర్లతో 181 (155) పరుగులు సాధించారు. అనంతపురం జట్టుకు 553 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. కడప బౌలర్లు ఉస్మాన్ 5 వికెట్లు, అలీఫ్ హాస్నేన్ 4 వికెట్లు, విజయ్ 1 వికెట్ తీసుకున్నారు. ఈ మ్యాచ్‌కు విశ్వనాథ, నితిన్‌కుమార్ అంపైర్లుగా వ్యవహరించారు.

ఫర్టిలైజర్స్ డీలర్లతో సమీక్ష

వజ్రకరూరు : విడపనకల్ మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్స్ డీలర్లకు మండల వ్యవసాయ అధికారి చెన్నయ్య ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ నిర్వాహకులు తప్పనిసరిగా బిల్ పుస్తకాలు, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. ధరల పట్టికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగుల మందులు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలన్నారు. నాసిరకమైన మందులను అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయవాడకు 'అనంత' విద్యుత్‌శాఖ సిబ్బంది

అనంతపురం : వరదల నేపథ్యంలో విజయవాడలో నెలకొన్న బీభత్సంలో సాయం చేసేందుకు అనంతపురం విద్యుత్ శాఖ సిబ్బంది విజయవాడకు వెళ్లారు. ఈమేరకు సోమవారం అనంతపురం నుంచి వెళ్తున్న బస్సుకు విద్యుత్ శాఖఖేస్ఇ సంతప్‌కుమార్ జెండా ఊపి సాగనంపారు. వీరి విజయవాడలో విద్యుత్ మరమత్తులను చేయనున్నారు. వెళ్లిన వారిలో విద్యుత్ శాఖ ఇఇ రమేష్, డిఇలు, ఎఇలు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గుమ్మఘట్ట : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి రాష్ట్రమంతా హరితవనాన్ని చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని బిటి.ప్రాజెక్టు గ్రామంలో ఉన్న కెజిబివిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆదేశానుసారం రాష్ట్రమంతా మొక్కలు నాటి హరితవనంలా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పిల్లలందరూ తమ తల్లి పేరుమీద మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. ఇకపోతే జనసేన అధినేత పవన్‌కళ్యాన్ పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థినులకు పెన్నులు, ప్యాడ్స్, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ షబానాబేగం, మండల ఇన్‌ఛార్జి గిరిమల్లప్ప, సర్పంచి విజయలక్ష్మి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, చిన్ని కిష్టప్ప, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఉద్యోగుల పనితీరు భేష్

తాడిపత్రి : పింఛన్ల పంపిణీలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన తాడిపత్రి మున్సిపాలిటీకి ప్రశంసాపత్రం లభించింది. ఆగస్టు 31న జరిగిన పింఛన్ల పంపిణీలో తాడిపత్రి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతోపాటు రాష్ట్రంలో అనంతపురం 4వస్థానంలో నిలిచింది. ఈనేపథ్యంలో సోమవారం కలెక్టర్‌లోని అనంతపురం రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ ప్రశంసాపత్రం అందుకున్నారు.

పుట్లూరు : పింఛన్ల పంపిణీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు పుట్లూరు ఎంపిడిఒ యోగానందరెడ్డికి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

పాఠశాలకు రోడ్డు వేయాలని వినతి

నార్పల : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు రోడ్డు వేయించాలని ఎస్ఎంసి ఛైర్మన్ రవికుమార్ సోమవారం స్థానిక ఎంపిడిఒ దివాకర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు రోడ్డు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే స్పందించి రోడ్డు వేయాలని కోరారు.

టిడిపి నేత సతీమణి మృతికి నివాళి

గుత్తి : టిడిపి సీనియర్ నాయకులు, గుత్తి చెరువు ఆయకట్టు మాజీ ఛైర్మన్ ఎన్.కేశవనాయుడు సతీమణి ఎన్.సుజాతమ్మ మృతికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సంతాపం వ్యక్తం చేశారు. ఈమేరకు పట్టణంలోని కేశవనాయుడు నివాసానికి చేరుకుని సుజాతమ్మ భౌతికకాయాన్ని పూలమాలేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ, సర్పంచి పి.భరత్‌కుమార్, టిడిపి నాయకులు బర్దివలి, జక్కలచెరువు ప్రతాప్, పి.కృష్ణయ్య, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

సీజనల్ వ్యాధులపై అవగాహన

గార్లదిన్నె : మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో మండల వైద్యాధికారిణి గౌతమి ఆధ్వర్యంలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దాదాపు 135 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రోడ్లపై మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారులు ముద్దయ్య, నూర్‌బాషా, శ్రీధర్, సిహెచ్ఒ లోక్‌నాథ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యల్లనూరు ఎంపిడిఒ వీరరాజు

యల్లనూరు : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ వీరరాజు సూచించారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కడా వర్షం నీరు నిల్వ ఉండకుండా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులతోపాటు, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూసి జెఇ సుప్రజారెడ్డి, పిఆర్ జెఇ నరేంద్ర, ఉపాధి ఎపిఒ షబ్బీర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గర్భిణులు చక్కటి పౌష్టికాహారం తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, అసుపత్రి వైద్యులు శ్రీనివాసబాబు, అమర్నాథ్, ఎపి పుల్లారెడ్డి, మాట్లాడుతూ గర్భిణులు కడుపులో బిడ్డ పెరుగుదలకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో మాతాశిశు మరణాలు తగ్గించేందుకు అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసిడిసి సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ పౌష్టికాహార వారోత్సవాలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని జూటూరు సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాలలో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, రక్తహీనతపై వివరించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ షాజిదా, సూపర్‌వైజర్ గౌడ్, ఎపిఎం, తదితరులు పాల్గొన్నారు.



గన్నెవారిపల్లి కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, ఆశావర్కర్లు

తాడపత్రి రూరల్ : పౌష్టికాహార వాత్సవాల్లో భాగంగా రూరల్ సెక్టార్‌లోని గన్నెవారిపల్లి కాలనీలో సోమవారం రక్త పరీక్షలు చేశారు. అనంతరం పౌష్టికాహార విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతిలత, అలివేలమ్మ, సావిత్రి, సునీత, అనసూయ, అమ్మనీ, అమ్ములు, ఆశావర్కర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 30వతేదీ వరకూ పోషకాహర మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజమణి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

జగన్..చంద్రబాబును చూసి నేర్చుకో..

టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం



విలేకరులతో మాట్లాడుతున్న పోతుల లక్ష్మీనరసింహులు

మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబును చూసి చాలా నేర్చుకోవాలని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు హితవు పలికారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే దగ్గుపాటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురవడంతో సిఎం చంద్రబాబు అర్ధరాత్రి కూడా వీధుల్లో తిరుగుతూ సహాయ చర్యలు చూస్తున్నారన్నారు. అదే జగన్ అయితే ఎప్పుడూ తన ప్యాలెస్‌ను విడిచి వచ్చిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు చంద్రబాబును విమర్శించడం మాని ప్రజలకు సేవ చేయడం నేర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, టిడిపి నాయకులు వన్నురప్ప, కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి కాశీవిశ్వనాథ్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కొండా, తదితరులు పాల్గొన్నారు.

'ఒపిఎస్ అమలు చేయకపోతే పుట్టగతులుండవు'

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉద్యోగ, ఉపాధ్యాయుల కోరిక మేరకు ఒపిఎస్ అమలు చేయకపోతే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని ఎపిటిఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్ హెచ్చరించారు. ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉరవకొండ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్‌లకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. ఒపిఎస్ అమలు కోసం ఉద్యమాలు చేస్తున్న తమకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాయకులు హామీలు ఇస్తున్నారు తప్ప అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాండురంగ, బీసీ రామాంజనేయులు, ఇమామ్, నజీర్, నరసింహులు, నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, మనోహర్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడిపత్రి అగ్రికల్చర్ డివిజన్ పరిధిలోని పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. ఇందులో భాగంగా కుమ్మెత్త తిమ్మనచెరువు, పసులూరు, జుటూరు, ఉల్లికల్లు, కొనగనిపల్లి, దిగువపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పత్తిలో కొన్నిచోట్ల పూత రాలడం, మరికొన్ని చోట్ల కాయ కుళ్లను గుర్తించారు. పత్తిలో ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను వేస్తే పంట సాధారణ స్థితికి వస్తుందన్నారు. అలాగే పూత రాలడానికి 200 లీటర్లలో 400 గ్రాముల బోరాన్, 40ఎంఎల్ ప్లానోఫిక్స్ మందుని కలిపి స్ప్రే చేస్తే అరికట్టవచ్చన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు ఉధృతిని తగించుకునేందుకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. వీటితోపాటు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేకులకుంట శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీకళ్యాణి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్, పెద్దపప్పూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

శింగనమల : ఇప్పటి వరకూ సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఆయా రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎఒ అన్వేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా బీడు పెట్టుకున్న రైతుల సౌకర్యార్థం ప్రభుతం 80 శాతం రాయితీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

గుత్తి : మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో మొక్కులు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎ.వెంకటేష్, జనసేన నాయకులు అశ్వ నాగప్ప,బండి సత్య, జికె.నాగ రంగాప్రసాద్, గోరంట్ల నాగయ్య,పవన్ తదితరులు పాల్గొన్నారు.

మాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జెఎసి ఏర్పాటు

అనంతపురం కలెక్టరేట్ : వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జెఎసిని ఏర్పాటు చేసినట్లు సంఘం గౌరవాధ్యక్షులు ఎం.ఓబులేసు తెలిపారు. జెఎసి గౌరవాధ్యక్షులుగా ఎం.ఓబులేసు, అధ్యక్షులుగా కోట్ల గంగాధర, ఉపాధ్యక్షులుగా దాసరి ఆదినారాయణ, డి.రామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జె.రామన్న, కోశాధికారిగా బిఎన్ శివలింగమూర్తి, జాయింట్ సెక్రటరీలు శుభమంచి శ్రీనివాసులు, కెవి.చలపతి, ఎం.రామాంజనేయులు, సుబ్బరాయుడు, సుగమంచి నాగప్ప, నరసింహమూర్తితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సహాయక ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు : కార్మికులపై వేధింపులకు పాల్పడుతూ జీతాల్లో కోతలు విధిస్తున్న మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న సహాయక ఇంజినీర్ హరికృష్ణపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ డివిజన్ కమిటీ సభ్యులు సత్తార్, జిలాన్, బాషా, రంగానాయక్, రాజు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'గుడ్ మార్నింగ్'

ప్రజాశక్తి-పామిడి



రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు పట్టణంలో టిడిపి నాయకులు సోమవారం గుడ్ మార్నింగ్ పామిడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 1, 2వవార్డుల్లో పర్యటించి స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ, సీసీ రోడ్ల సమస్యలను స్థానికులు నాయకుల దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవ, ఆర్‌ఆర్.రమేష్, బొమ్మ మోహన్‌కృష్ణ, కరూరు శివశంకర్, రవి, రంగస్వామి, శీన, రాజు, వలిపి రామాంజనేయులు, నరసప్ప, మధు, శ్రీరాములు, రమేష్, భాస్కర్, షేక్షావలి, ఓబులేసు, రవి, నిరంజన్, రాజశేఖర్‌గౌడ్, హరినాథ్‌యాదవ్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని మండపాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పుట్లూరు : మండలంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలనుకునే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ శేషారెడ్డి, ఎస్ఐ హేమాద్రి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండపాల కమిటీ సభ్యులతో వారు మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మండపాల అనుమతి కోసం దరఖాస్తు చేఉకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటి మల్లేష్ ప్రసాద్, వీఆర్వోలు, మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం


పామిడి : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన సందర్భంగా పట్టణంలోని 4వ వార్డు అంబేద్కర్ కాలనీలో మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 120 మందికి చికిత్స చేయగా, 20 మందికి గుండెపోటు వచ్చే లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి అదనపు వైద్యం కోసం ఎన్టీఆర్ వైద్య సేవకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో పామిడి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి, నాయకులు ఆర్ఆర్ రమేష్, కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, ముసలిరెడ్డి, వాసగిరి మణికంఠ, బొమ్మా మోహన్, సాకే గోవిందు, మండల విద్యుత్ అధికారి మధుసూదన్, మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ నాగరాజు, మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, మేనేజర్ బాబురావు, నరేష్, మహేష్, భాగ్య, దర్శిని, అమరావతి, నక్కల రామాంజి, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన రాజశేఖర్

గార్లదిన్నె : మండల పరిధిలోని కణంపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నార్పల మండలం సుల్తాన్‌పేటకు చెందిన రాజశేఖర్ (26) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజశేఖర్ గుత్తి నుంచి ద్విచక్ర వాహనంలో అనంతపురం వస్తుండగా కణంపల్లి సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తర్వాత పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రాయదుర్గంలో చోరీ

రాయదుర్గం : పట్టణంలోని వట్లకుంట సమీపంలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. సమీపంలోని చెన్నవీరస్వామి ఆలయంలో ప్రత్యే పూజలు, అభిషేకాలు ఉండగా ఆ ఇంటి సభ్యులు రాత్రి అక్కడే వెళ్లి నిద్రించారు. ఉదయం పక్కింటి వారు గమనించి సమాచారం ఇవ్వడంతో యజమాని లక్ష్మీదేవి ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉంచిన అర కిలో వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, డిపాజిట్ బాండ్, ఎల్ఐసి బాండు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

ఆత్మకూరు : భూ తగాదా విషయంలో తమ్ముడిపై హత్యాయత్నానికి పాల్పడిన అన్నపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ హేమంత్‌కుమార్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 29న మండలంలోని వడ్డుపల్లికి చెందిన గడుపుటి రంగప్ప, తన అన్న చిన్న సుబ్బయ్య, భార్య సువర్ణమ్మ కలిసి భూతగాదా విషయంలో గొడవ పడ్డారు. ఈ గొడవలో రంగప్పపై చిన్న సుబ్బయ్య, భార్య సువర్ణమ్మ రాయితో బాధడంతోపాటు బడిసెతో చంపేందుకు యత్నించినట్లు రంగప్ప భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించి సోమవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.